క్లుప్తంగా

ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నీ విజేత టౌన్ జట్టు



విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర

కొవ్వూరు: స్థానిక బ్రిడ్జిపేట సమీపంలోని రైల్వే ప్రాంగణంలో నిర్వహించిన ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను కొవ్వూరు టౌన్ జట్టు గెలుచుకుంది. ఈ టోర్నమెంట్ రన్నర్స్‌గా 15వ వార్డు శివ టీమ్ నిలిచింది. అక్షయపాత్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్ విజేతలకు 15వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నేత అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర బహుమతులు అందజేశారు. విన్నర్స్ జట్టుకు రూ.20 వేలు, రన్నర్స్ జట్టుకు రూ.10 వేల నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. అంతేగాకుండా టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. మాజీ కౌన్సిలర్ చీరా వెంకటరమణ, సూర్ల నగేష్, గుబతాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అరటి రైతులకు పంటల బీమా సాయం

నల్లజర్ల: మండలంలో 89 మంది అరటి రైతులకు పంటల బీమా సాయం అందింది. ఈ బాపతు రూ.3.62 లక్షల చెక్కును మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ రైతులకు అందజేశారు. 2022 ఖరీఫ్ సీజన్‌లో అరటి పంట నష్టపోయిన రైతులకు ఈ మొత్తాన్ని అందించినట్టు చెప్పారు. లబ్ధిదారుల వివరాలను ఆయా గ్రామ రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శనగా ఉంచనున్నట్టు చెప్పారు.ఈ బీమాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు తెలియజేయాలన్నారు.

బోసురాజు తల్లి మృతికి పలువురి సంతాపం

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరుకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యుడు పేరిచెర్ల సత్యనారాయణరాజు (బోసు రాజు) మాతృమూర్తి స్వరాజ్యలక్ష్మి (90) ఆదివారం ఆయన స్వగృహంలో ఆదివారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. స్వరాజ్యలక్ష్మికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు గాదిరాజు సుబ్బారాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, ముదునూరి సూర్యనారాయణరాజు, పార్టీ కొవ్వూరు మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న సంతాపం తెలిపారు.

12 మందితో కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ

దేవరపల్లి: కాంగ్రెస్ పార్టీ గోపాలపురం నియోజకవర్గానికి 12 మంది సభ్యులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసినట్టు డీసీసీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్ ప్రకటించారు. దుద్దుకూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వెలగా రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మార్టిన్ లూథర్ కమిటీ సభ్యుల జాబితాను ప్రకటించారు. వెలగా రామకృష్ణ, మటపర్తి రామ్మోహన్‌రావు, పాకలపాటి భీమేశ్వరరావు, వేగివాడ నాగేశ్వరరావు, పిట్టా రామారావు, కవులూరి రత్నరాజు, దాసరి కుటుంబరావు, చాపల వెంకటేశ్వరరావు, ఫ్రాన్సిస్, పాకా చిన్నబ్బాయి, గుత్తికొండ సూరిబాబు, జ్యేష్ఠ సతీష్, బలేపల్లి మురళీధర్‌ను నియమించినట్టు తెలిపారు. ఈసందర్భంగా మార్టిన్ లూథర్ మాట్లాడుతూ పార్టీ అధినేతలు త్వరలో పోలవరం ప్రాజెక్ట్ పర్యటనకు వస్తున్నట్టు తెలిపారు.

'పాలెం'ఘటనను నిరసిస్తూ దళితుల ధర్నా

నిడదవోలు: పట్టణంలోని చర్చిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం దళిత నాయకులు ధర్నా చేశారు. గోకవరం మండలంలోని తిరుమలాయపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎందుకు తొలగించారని ప్రశ్నించిన దళితులపై అక్కడి అగ్ర కులస్తులు, పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ వారీ ఆందోళన చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా దళిత సంఘాల స్టీరింగ్ కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు, చెట్టి రామకృష్ణ, మర్తి అర్జునుడు, నక్కా వెంకటేశ్వర్లు, గెడ్డం రవీంద్రబాబు, టి.నాని తదితరులు పాల్గొన్నారు.

దారవరంలో..

చాగల్లు: గోకవరం మండలంలోని తిరుమలాయపాలెం గ్రామ దళితులకు న్యాయం జరిగే వరకూ వారికి అండగా ఉంటామని జేఏసీ నాయకుడు జువ్వల రాంబాబు అన్నారు. గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మండలంలోని దారవరంలో ఆదివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో రాంబాబు మాట్లాడుతూ తిరుమలాయపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తక్షణమే ప్రతిష్ఠించాలని, సాంఘిక బహిష్కరణకు పిలుపునిచ్చిన వారిని వెంటనే గుర్తించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుమ్మాపు జాన్, మరపట్ల ఏసు, మద్దాల నరేంద్ర, ఉబా బన్నీ, సరిపల్లి దానయ్య, గంటి ధర్మయ్య పాల్గొన్నారు.

ఇక పల్లెల్లోనే రిజిస్ట్రేషన్..

- సచివాలయాల్లో అందుబాటులోకి సేవలు
- కొవ్వూరు డివిజన్‌లో తొలి విడతలో 11 చోట్ల..
- దశలవారీగా మరింత విస్తరణ
- ప్రజలకు మరింత చేరువగా ప్రభుత్వ సేవలు



నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామ సచివాలయం

నిడదవోలు రూరల్: గ్రామీణుల వ్యయ ప్రయాసలు తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ సేవలకు శ్రీకారం చుట్టింది. స్థిరాస్తుల క్రయ, విక్రయాలు ఇకపై ఎవరి సచివాలయం పరిధిలో వారు చేసుకునే వెసులుబాటు కల్పించింది. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా తొలి విడతలో 11 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. తొలి విడతలో నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు మండలంలో తిమ్మరాజుపాలెం, ఉండ్రాజవరం మండలంలోని కె.సావరం, పెరవలి మండలంలోని అజ్జరం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలకు అనుమతి వచ్చింది. ఎంపిక చేసిన సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు రిజిస్ట్రేషన్ విధానంపై దశల వారీగా శిక్షణ ఇచ్చారు. దీంతో పాటు ఆయా రెవెన్యూ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు, దేవదాయ భూముల వివరాలను సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచారు. క్రయ విక్రయదారులకు ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వాటి వివరాలను పంపుతారు. దీంతో అక్కడి సబ్ రిజిస్ట్రార్ సేవల వివరాలను రికార్డులో పరిశీలించి నమోదు చేస్తారు. ఇంతటితో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. నిర్దేశించిన సమయంలోగా వినియోగదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తారు.

15 రకాల సేవలు..

రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన 15 రకాల సేవలను సచివాలయం ద్వారా పొందవచ్చు. భూముల రిజిస్ట్రేషన్, భూముల నకలు డాక్యుమెంట్లు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఈసీ, మాన్యువల్ ఈసీ, ఆర్‌హెచ్ (రైట్ టు హోల్డర్) పేజీ, బ్యాంకు తనఖాలు, అసోసియేషన్ల రిజిస్ట్రేషన్లు, 1933–53 మధ్య రిజిస్ట్రేషన్ నకలు పేజీలు, ఈ–స్టాంపింగ్‌తో పాటు మరో ఐదు రకాల సేవలను సచివాలయాలు అందిస్తాయి.

కొవ్వూరు డివిజన్‌లో తొలి విడతలో అమలవుతున్న సచివాలయాలు

మండలం	రిజిస్ట్రేషన్ సేవలందించే సచివాలయం
నిడదవోలు	తిమ్మరాజుపాలెం
ఉండ్రాజవరం	కె.సావరం
పెరవలి	అజ్జరం
కొవ్వూరు	చిడిపి, తోగుమ్మి
తాళ్లపూడి	బల్లిపాడు
చాగల్లు	నందిగంపాడు, నెలటూరు
గోపాలపురం	గంగవరం, జగన్నాథపురం
దేవరపల్లి	పల్లంట్ల

డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ



రిజిస్ట్రేషన్ సేవలను ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువ చేసింది. ఇందుకోసం సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. 15 రకాల సేవలను అందుబాటులోకి తీసుకు రావడంతో స్థానికంగానే రిజిస్ట్రేషన్ సేవలను పొందవచ్చు. దశల వారీగా అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విధానంతో ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం అవుతాయి. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– వీఎస్‌వీ వినయ్, డిజిటల్ అసిస్టెంట్, తిమ్మరాజుపాలెం

వనితా క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు



పేద ఆర్యవైశ్య మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

నిడదవోలు: వనితా క్లబ్ ద్వారా మహిళలు చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని వాసవీ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ కేదారిశెట్టి రవికుమార్ అన్నారు. వాసవీ వనితా క్లబ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డాన్ టు డెస్క్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మదన గోపాలస్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో పేద రైతుకు స్ప్రేయర్ అందించారు. ఆర్యవైశ్య పేదలకు నిత్యావసర సరకుల కిట్లు, నూతన దుస్తులు అందించారు. నలుగురి పేదలకు పింఛన్ల కింద నగదు అందజేశారు. మదన గోపాలస్వామి ఆలయంలో సిమెంట్ బెంచ్ ఏర్పాటు చేశారు. రిటైర్డు మిలిటరీ ఉద్యోగి గరగ శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ ఇంటర్నేషనల్ సహాయక కోశాధికారి కుసుమంచి పాపారావు, కనగర్ల విజయరామకృష్ణ, మానేపల్లి వెంకటరమణ, చిలకల మల్లికార్జునరావు, కేదారిశెట్టి సునీత, పెరుమాళ్ళ విజయ, వాసవీ వనితా క్లబ్ అధ్యక్షురాలు దివ్వెల ఫణిమాధురి, కార్యదర్శి గొల్లపూడి గాయత్రి, కోశాధికారి జవ్వాది శిరీష తదితరులు పాల్గొన్నారు.

తండ్రి జ్ఞాపకార్థం ఫ్రీజర్ బహూకరణ



ఫ్రీజర్‌ను బహూకరిస్తున్న దాత కుటుంబం

నల్లజర్ల: అనంతపల్లిలో ఇటీవల మృతి చెందిన రైతు అవిర్ని సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.70 వేల విలువైన మార్చురీ ఫ్రీజర్‌ను మానవత సంస్థ మండల శాఖకు ఆదివారం బహూకరించారు. సత్యనారాయణ కుమారుడు గంగాధరరావు మాట్లాడుతూ పరిసర గ్రామాల వారందరూ వినియోగించుకునేలా ఫ్రీజర్‌ను అందుబాటులో ఉంచాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో మానవత సంస్థ డైరెక్టర్ జమ్ముల సతీష్, చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, ఎస్.రాజేంద్రప్రసాద్, గుత్తికొండ వరప్రసాద్, గుండు త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టరీ ఆవిష్కరణ

మానవత సంస్థ 2023–24 సంవత్సరపు డైరెక్టరీని ఆ సంస్థ జిల్లా నియంత్రణ కమిటీ చైర్మన్ కండెపు వెంకట సూర్యనారాయణ ఆదివారం నల్లజర్లలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, డైరెక్టర్లు పాతూరి సత్యనారాయణ, జిల్లా కోశాధికారి గుత్తికొండ వరప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరసింహరాజు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ద్వారకాతిరుమల: మండలంలోని రామసింగవరం పంచాయతీ కొత్తగూడెంకు చెందిన వ్యాపారవేత్త పెన్మత్స నరసింహరాజు తల్లి వరలక్ష్మి ఇటీవల మృతి చెందారు. దాంతో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆదివారం కొత్తగూడెంలోని ఆమె ఇంటికి వెళ్లి, ఆమె కుమారులు చక్రవర్తిరాజు, కొండరాజు, వెంకటపతిరాజు, నరసింహరాజు, రామకృష్ణరాజులను పరామర్శించి, సంతాపాన్ని తెలిపారు. అలాగే వరలక్ష్మి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ద్వారకాతిరుమల జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, నల్లజర్ల సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్ తదితరులు ఉన్నారు.

కొవ్వూరు సమగ్రాభివృద్ధికి చర్యలు



కొవ్వూరు ఇందిరమ్మ కాలనీలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న హోం మంత్రి తానేటి వనిత

- హోం మంత్రి తానేటి వనిత
- పట్టణంలో రూ.1.78 కోట్ల విలువైన రోడ్లు, డ్రైన్ల ప్రారంభం
- 'రుడా' ద్వారా రూ.1.80 కోట్ల పనులు

కొవ్వూరు: కొవ్వూరు పట్టణ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలోని ఎనిమిది వార్డుల్లో నిర్మించిన 10 సిమెంట్ రోడ్లు, డ్రైన్లను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ పనుల విలువ రూ.1.78 కోట్లు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలో మరో రూ.3 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా ఈ మొత్తంలోని రూ.2 కోట్ల వ్యయంతో నందమూరు రోడ్డులో అవుట్ ఫాల్ డ్రైన్ నిర్మాణం చేపడతామన్నారు. మిగిలిన రూ.కోటి నిధులతో ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. వాటిలో రూ.50 లక్షల విలువైన పనులు ఇప్పటికే పూర్తి కావచ్చాయన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ద్వారా పట్టణంలో పలు సుందరీకరణ పనులు చేపడుతున్నామని చెప్పారు. గోష్పాద క్షేత్రం వద్ద ఏటిగట్టును రూ.1.50 కోట్ల వ్యయంతో సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పట్టణాన్ని అన్ని రకాలుగానూ అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, వైస్ చైర్ పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, కౌన్సిలర్లు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, బత్తిన నాగరాజు, రుత్తల భాస్కరరావు, మద్దిపట్ల సాయిగీత, చీరా అరుణ, అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, తోట లక్ష్మీ ప్రసన్న, దేవగుప్తాపు చాందిని, కో–ఆప్షన్ సభ్యుడు ఏలూరి వెంకట్, సిద్దన వాసు, బావన బెన్ని, గండ్రోతు శివరామకృష్ణ, కవల నాగేశ్వరరావు, మేరిపో వీర్రాజు, పిక్కి శ్రీనివాస్, యజ్జల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మానవత ' సామాజిక సేవలు భేష్

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- నిడదవోలు శాఖ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



మానవత సంస్థ నూతన కార్యవర్గ సభ్యులతో నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సామాజిక సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు కొనియాడారు. మానవత సంస్థ నిడదవోలు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం రాత్రి పట్టణంలోని ఏబీఎస్ టౌన్ హాల్లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన తన ప్రసంగంలో కొన్నేళ్లుగా మానవత సంస్థ నిడదవోలు శాఖ చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రధానంగా మృతదేహాలను భద్రపరుచుటకు ఏర్పాటు చేసిన ఫ్రీజర్ పేదలకు ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. మానవత సంస్థ నిడదవోలు శాఖ నూతన అధ్యక్షుడిగా కాజ గంగరాజు, కార్యదర్శిగా పీఎవీ రమణ, ఉపాధ్యక్షుడిగా జీవీ కృష్ణారావు, కోశాధికారిగా గెడా రామచంద్రరావులతో కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మానవత చైర్మన్ టీవీవీ సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి శాఖ నూతన కార్యవర్గ సమావేశం

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ నూతన కార్యవర్గ తొలి సమావేశాన్ని తాళ్లపూడిలో నిర్వహించారు. ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు సాయన సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంస్థ ద్వారా భవిష్యత్తులో చేపట్టబోయే సేవా కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు తిరిగిపల్లి దోసాలు, అప్పన హనుమంతరావు, పెమ్మాడి దుర్గాప్రసాద్, సనపల రాజశేఖర్, రీజినల్ చైర్మన్ వి.చంద్రయ్య, గోకవరపు బాబులు, సీహెచ్ ఆంజనేయులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక వైభవానికి ప్రతీక భగవాధ్వజం



గురుపూజోత్సవంలో మాట్లాడుతున్న వక్త శ్రీనివాస శర్మ

చాగల్లు: ధర్మరక్షణ కోసం ప్రాణాలు తృణప్రాయంగా సమర్పించిన మన పూర్వీకుల త్యాగమయ జీవనాన్ని మన కళ్లముందు సాక్షాత్కరింపజేసేది భగవాధ్వజమని రాష్ట్ర న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు పతివాడ రామరాజు అన్నారు. యుగయుగాల ధార్మిక వైభవానికి, తత్వచింతనకు ప్రతీక భగవాధ్వజమని ఆయన పేర్కొన్నారు. అందుకే ఆర్‌ఎస్‌ఎస్ భగవాధ్వజమును గురువుగా స్వీకరించిందన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కాకతీయ కల్యాణ మండపంలో గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రామరాజు ప్రసంగించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్ పిచ్చికల వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఇంతటి గొప్పదైన భగవధ్వజానికి తను, మన, ధన పూర్వకంగా పూజించాలన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా అధ్యక్షుడు లింగాల శ్రీనివాస శర్మ, కె. సూర్యప్రకాశరావు, జుట్టా వెంకట గణపతి, లింగాల శ్రీనివాస శర్మ, పాలిశెట్టి శ్రీను, కంటిపూడి అచ్యుత ప్రసాద్, కోడి శ్రీనివాస్, కైలా మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై షేక్ సుభానీ



మద్దూరు వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

నిడదవోలు రూరల్: పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలనూ సద్వినియోగం చేసుకోవాలని సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ సూచించారు. నిడదవోలు శ్రీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం సమిశ్రగూడెం గీతా మందిరంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎస్సై సుభానీ ప్రారంభించారు. క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ కన్నాజీ సిద్ధార్థ, పిల్లల వైద్య నిపుణురాలు తోట శిరీష సుమారు 75 మంది రోగులను పరీక్షించారు. వారిలో అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, ఏఎస్సై పరమహంస, స్థానికులు పాల్గొన్నారు.

రియల్లీ గుడ్ న్యూస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

కొవ్వూరు: రియల్లీ గుడ్ న్యూస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మద్దూరు గ్రామంలోని కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం కిమ్స్ వైద్యులు స్వర్ణ, రామ్మోహన్‌రావులు సుమారు రెండు వందల మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అలాగే పలువురికి నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. అంతేగాకుండా గ్రామానికి చెందిన సుమారు 50 మంది పేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. రియల్లీ గుడ్ న్యూస్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎస్.నాగర్జున, బొబ్బర్లలంక, మద్దూరు యూత్ సభ్యులు వి.శోభన్‌బాబు, పి.విజయ్, వేదాల ఆనందబాబు, వేదాల అజయ్, డి.తేజ, ఎన్.ప్రవీణ్ సేవలు అందించారు.

గోదావరికి మహా నీరాజనం



గోదావరికి మహా నీరాజనం సమర్పిస్తున్న పండితులు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలో ఆదివారం రాత్రి 213 మాసోత్సవంలో భాగంగా గోదావరి నదికి మహా నీరాజనం సమర్పించారు. ముందుగా గోదావరి మాతకు శాస్త్ర యుక్తంగా పూజలు చేశారు. అనంతరం నదికి వివిధ రకాల హారతులిచ్చారు.గోదావరి నీరాజన సమితి అధ్యక్షుడు కలిగొట్ల కృష్ణారావు, జ్యోతిష్య పండితులు తుట్టగుంట భైరవ మూర్తి, పాలకోడేటి సత్యనారాయణమూర్తి, మద్దుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శి అల్లూరి బదిలీ

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం గ్రామ సచివాలయం కార్యదర్శి అల్లూరి సత్యనారాయణను రంగంపేట మండలం, వడిశలేరు గ్రామ సచివాలయానికి బదిలీ చేస్తే జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఆయన స్థానంలో గౌరీపట్నం కార్యదర్శిగా దుద్దుకూరు కార్యదర్శి రామచంద్రరావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన భక్తుడి కారు



ప్రమాదంలో కారుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

ద్వారకాతిరుమల: శ్రీవారి దర్శనానంతరం జంగారెడ్డిగూడెం సమీపంలోని మద్ది క్షేత్రానికి వెళుతున్న ఒక భక్తుడి కారు స్థానిక కోత మిషన్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, భక్తుడి కుటుంబం సురక్షితంగా బయట పడింది. స్థానికుల కథనం ప్రకారం, కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, బొమ్ములూరుకు చెందిన లక్ష్మణరావు కుటుంబ సభ్యులతో కలసి తన కారులో ఉదయం ద్వారకాతిరుమల క్షేత్రానికి విచ్చేశాడు. స్వామివారి దర్శనానంతరం మద్ది ఆంజనేయ స్వామివారిని దర్శించేందుకు వెళుతున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చే సరికి ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని వేగంగా ఢీకొట్టింది. దాంతో విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడింది. ఈ ప్రమాదంలో భక్తుడు లక్ష్మణరావు కుటుంబం సురక్షితంగా బయటపడగా, కారు ధ్వంసమైంది.

వేగేశ్వరపురంలో అ'పూర్వ' సమ్మేళనం



వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1990- 1991 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు, వారి గురువులు



పోతవరం హైస్కూల్ పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి: వేగేశ్వరపురం కేఎస్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1990–1991 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో జరిగింది. దాదాపు 30 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు అందరూ కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఉదయం నుంచి పాఠశాల ఆవరణలో వారు ఒకరినొకరు కలుకుని నాటి పాఠశాల రోజుల్లో గడిపిన మధుర క్షణాలను, అప్పటి ఘటనలను గుర్తు చేసుకుని ఉత్సాహంగా గడిపారు. అప్పుడు తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులు రామశాస్త్రి, వెంకటగిరి, శ్రీనివాస్, అర్జునరావు, డ్రాయింగ్ మాస్టర్ శ్రీనివాస్, సిబ్బంది లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం వారితో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బుద్దాల కృష్ణ, అడ్డాల శ్రీహరి, అడ్డాల నాగరాజు, పెట్టా శ్రీను, నున్న కాశీ, బుద్దాల సూరిబాబు, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

పోతవరంలో..

నల్లజర్ల: పోతవరం జెడ్పీ హైస్కూల్ 1988–89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాల్లో సమావేశమయ్యారు.గతేడాది కూడా వీరంతా కలుసుకున్నారు. ఒకరినొకరు నాటి తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. ఏలూరులో ఉంటున్న తమ సహ విద్యార్థిని, వితంతువు ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉందని తెలిసి ఆమె కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. తొలుత రూ.20 వేలు సాయంగా అందించారు. కార్యక్రమానికి నాయుడు కృష్ణ, యెల్లిన శ్రీనివాస్ చౌదిరి, కాట్రగడ్డ శ్రీనివాస్, లీలాకుమారి, కోహిమ, సంధ్యారాణి సారథ్యం వహించారు.

కౌలుదారులుగా 4,129 మంది గుర్తింపు

- ఇప్పటికే 2500 మందికి సీసీఆర్ కార్డుల జారీ



సీసీఆర్ కార్డులు అందిస్తున్న ఏవో కమల్‌రాజ్

నల్లజర్ల: కౌలుదారులను కూడా రైతులుగా గుర్తించి ప్రభుత్వం వారికి కొన్ని హక్కులు కల్పిస్తోంది. రైతు భరోసా కేంద్రం వేదికగా భూ యజమాని, సాగుదారుని మధ్య 11 నెలల కాలానికి అవగాహనతో కూడిన అగ్రిమెంట్ వర్తించేలా పంటసాగు హక్కు పత్రం (సీసీఆర్‌సీ) కార్డు జారీ చేస్తోంది. మండలంలో ఈ ఏడాది 4,129 మందిని అధికారులు కౌలు రైతులుగా గుర్తించారు. ఇంతవరకూ వారిలో 2500 మందికి సీసీఆర్ కార్డులు అందించినట్టు మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. మిగతా వారికి రెండు,మూడు రోజుల్లో పంటసాగు హక్కు పత్రాలు అందిస్తామన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంట రుణాల మంజూరు, సున్నా వడ్డీ, పంటనష్టం అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కౌలుదారులకు వైఎస్సార్ రైతు భరోసా కూడా వర్తించేలా నిబంధనలు రూపొందించినట్టు ఏఓ తెలిపారు. భూ యజమానులు, బ్యాంకర్లతో చర్చించి జూలై, ఆగస్టు నెలల్లో పంట రుణాలతో పాటు ఇతరత్రా ప్రభుత్వ రాయితీలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.